క్లుప్తంగా

నదులపై అవగాహన



మైలవరం: భారతదేశంలో అతి పురాతనమైనది గంగానది అని మైలవరం ఎల్‌హెచ్‌ఆర్ హైస్కూల్ ఉపాధ్యాయుడు బీఎస్సీ బోస్ అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు భారతదేశంలో ప్రవహించే నదులు, వాటి జన్మ స్థలాలు అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల తనిఖీ

ఇబ్రహీంపట్నం:ఇబ్రహీంపట్నంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం వాహనాలను తనిఖీ చేసి హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించామన్నారు. హెల్మెట్ ధరించని వాహన చోదకులు, ట్రాఫిక్ చెలానాలు పెండింగ్ ఉన్న వాహనాలు, వాహన రికార్డులు లేని వాహనదారులను గుర్తించి అవగాహన కల్పించారు. ప్రత్యేక డ్రైవ్‌ను సీఐ చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

మైలవరం: రెడ్డిగూడెం మండలం కొత్త నాగులూరు గ్రామంలో అంకమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పూలు, నిమ్మకాయలతో అలంకరించి పూజలు చేశారు. వేద పండితుల వేద మంత్రాల మధ్య విగ్రహ పునఃప్రతిష్ఠ జరిగింది. నాగులూరు, రెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

పాఠశాలల నైట్ వాచ్‌మన్లకు సౌకర్యాలు కల్పించాలి

మునునూరు: పాఠశాలల్లో పనిచేస్తున్న నైట్ వాచ్‌మన్లకు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ఏఐసీసీటీయూ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐసీసీటీయూ అనుబంధ సంస్థ పాఠశాలల నైట్‌వాచ్‌మన్ల సంఘ మండల అధ్యక్షుడు బొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సమావేశం బుధవారం నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య మాట్లాడుతూ వివిధ పాఠశాలల్లో నైట్ వాచ్‌మన్లుగా పనిచేస్తున్న వారికి యూనిఫారమ్, బూట్లు, ఇతర రక్షణ సౌకర్యాలు కల్పించాలని, రూ.26 వేలు వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ముక్కు నాగేశ్వరరావు, శివాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఆపరేటర్లను తొలగించొద్దని వినతి

చాట్రాయి: వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేసే ఆపరేటర్లను తొలగించవద్దని కోరుతూ మండల రేషన్ బియ్యం ఆపరేటర్లు బుధవారం తహసీల్దార్ ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలో నియమితులైన 11 మంది ఆపరేటర్లు రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం జూన్ నుంచి వాహన ఆపరేటర్లను తొలగించి రేషన్ షాపుల వద్దనే పంపిణీ చేస్తామని తీసుకున్న నిర్ణయంతో తాము రోడ్డున పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

20 మంది జూదరుల అరెస్టు



మైలవరం: మైలవరం మండలం మొర్సుమల్లి గ్రామ శివారులోని మామిడి తోటలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం పోలీసులు దాడి చేశారు. 20 మంది జూదరులను అరెస్టు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరి కొంతమంది పారిపోయినట్లు సమాచారం. భారీ మొత్తంలో నగదు దొరికినట్లు సమాచారం.

మజ్జిగ పంపిణీ

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో 16వ రోజు బుధవారం ఐనీడ్స్ ఆప్టికల్స్ షాపు వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బాటసారులకు నిర్వాహకులు మజ్జిగ పంపిణీ చేశారు. ఐ నీడ్స్ యజమాని పుల్లారెడ్డి, చంద్రశేఖర్, చిన్నం అప్పారావు, మనోహర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ వెలుగులేవి?

- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీపై అనాసక్తి
- వినియోగదారుడి వాటాపై అసంతృప్తి
- రుణాలు మంజూరులో బ్యాంకర్ల జాప్యంతో వెనకడుగు
- సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు ఆసక్తి చూపని ప్రజలు



జి.కొండూరులో ఇటీవల ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్

జి.కొండూరు మండల పరిధిలో విద్యుత్ కనెక్షన్లు, ఏర్పాటైన సోలార్ రూఫ్‌టాప్‌ల వివరాలు

గృహ విద్యుత్ కనెక్షన్‌లు	19 వేలు
సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు లక్ష్యం	7,040
ఏర్పాటైన సోలార్ రూఫ్‌టాప్‌లు	65

జి.కొండూరు: విద్యుత్ వినియోగదారులు సొంతగా విద్యుత్‌ని ఉత్పత్తి చేసి తాము వినియోగించుకోగా మిగులు విద్యుత్‌ని విక్రయించుకునేలా కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద రాయితీపై అందిస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుపై ప్రజలు ఆసక్తి చూపడంలేదు. వినియోదారుడి వాటా అధికమవడం, నిర్వహణపై అనుమానాలు, రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్ల జాప్యం, అవగాహనా లోపం వంటి అంశాల వల్ల సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు నత్తనడకన సాగుతోంది. కేంద్ర ప్రభుత్వ రాయితీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సైతం కొంతమేర రాయితీ అందిస్తే ఈ పథకంపై ప్రజలు ఆసక్తి చూపే అవకాశం ఉంది.

ఏర్పాటు అంతంతమాత్రమే

సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు నత్తనడకన సాగుతోంది. రెండు కిలోవాట్‌ల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు మొత్తం ఖర్చు రూ.1.50 లక్షలు కాగా కేంద్ర ప్రభుత్వం రూ.60 వేలను రాయితీగా అందిస్తోంది. మిగిలిన రూ.90 వేలలో వినియోగదారుడి వాటాలో రూ.10 వేలు డిపాజిట్ చేయాల్సి ఉండగా రూ.80 వేలను బ్యాంకు రుణంగా ఇప్పిస్తున్నారు. అదేవిధంగా మూడు కిలోవాట్‌ల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ.2.10 లక్షలు ఖర్చు అవుతుండగా కేంద్ర ప్రభుత్వం రాయితీ రూ.78 వేలు పోగా వినియోగదారుడి వాటాలో రూ.10 వేలు డిపాజిట్, రూ.1.22 లక్షలను బ్యాంకు రుణంగా ఇప్పిస్తున్నారు. ఈ బ్యాంకు రుణాన్ని వినియోగదారుడు తాను వినియోగించుకోగా మిగులు విద్యుత్‌ను విద్యుత్ శాఖకు విక్రయించి దానిపై వచ్చిన ఆదాయంతో రుణ వాయిదాను చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్ వినియోగం ఎక్కువైనప్పుడు ఈ వాయిదాల చెల్లింపు వినియోదారుడికి తలనొప్పిగా మారే అవకాశం ఉంది. అంతే కాకుండా ఈ సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు కొంతమంది ఆసక్తి చూపినప్పటికీ బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు ముప్పుతిప్పలు పెడుతున్న క్రమంలో ప్రజలు ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

పథకం అమలు ఇలా..

పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద రెండు కిలోవాట్‌ల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు 60 శాతం రాయితీ, అంతకు మించి కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు 40 శాతం రాయితీని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. నెలకు 150 యూనిట్ల లోపు విద్యుత్‌ని వినియోగించే వారికి 2 కిలోవాట్‌ల లోపు సోలార్ రూఫ్‌టాప్ సరిపోతుంది. అదేవిధంగా 300 యూనిట్ల వరకు విద్యుత్‌ని వినియోగించే వారికి 3 కిలోవాట్‌ల సోలార్ రూఫ్‌టాప్ సరిపోతుంది. అంతకు మించి విద్యుత్‌ని వినియోగించే వారు వారి డిమాండ్‌ను బట్టి 3 కిలో వాట్‌లకు మించిన సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ గరిష్ఠంగా రూ.78 వేలు మాత్రమే కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ఈ విధంగా ఇంటిపైన ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ని అవసరం మేరకు వినియోగించుకోగా మిగులు విద్యుత్‌ని నెట్ మీటరింగ్ ద్వారా విద్యుత్ శాఖకు విక్రయించుకోవచ్చు. ఈ విధంగా మిగులు విద్యుత్‌ని విక్రయించగా వచ్చిన ఆదాయంలో సగాన్ని బ్యాంకు రుణానికి వాయిదా కింద జమ చేసుకుంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం




సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు కోసం విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. కొన్ని అపోహల వల్ల వినియోదారులు ఆలోచిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేసేందుకు రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేశాం. మండల పరిధిలో 6,400 ఎస్సీ, ఎస్టీల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి.

–షేక్ మహ్మద్ షఫీ, విద్యుత్‌శాఖ ఏఈ, జి.కొండూరు

● ఆత్మీయ కలయిక

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు తాడేపల్లిలోని జగన్ నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ పలు అంశాలపై తిరుపతిరావుతో చర్చించారు. –జి.కొండూరు



తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వేములకొండ తిరుపతిరావు

పెద్ద చెరువుకు పడిన గండ్లను వెంటనే పూడ్చాలి

సీపీఐ నాయకులు చలసాని వెంకట రామారావు డిమాండ్

నూజివీడు: గత ఏడాది కురిసిన వర్షాలతో వచ్చిన భారీ వరదకు పట్టణంలోని పెద్ద చెరువుకు నాలుగు చోట్ల పడిన గండ్లను వెంటనే పూడ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకులు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులతో కలిసి బుధవారం ఆయన చెరువు గండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ చెరువుకు గండ్లు పడి తొమ్మిది నెలలు అవుతున్నా ఇంతవరకు వాటిని పూడ్చకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ చెరువు పట్టణానికి ఎంతో ముఖ్యమైనదని, దీనిలో నీళ్లు ఉంటేనే పట్టణంలోని బావులు, బోర్లలో నీటిమట్టం పడిపోకుండా ఉంటుందని చెప్పారు. ఇంతవరకు గండ్లు పూడ్చకుండా ఎందుకు తాత్సారం చేశారో ఇరిగేషన్ అధికారులు, పాలకులు పట్టణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

కొందరు స్వార్థపరులు చెరువులో ఉన్న నీటిని కూడా వెళ్లగొట్టారన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు నిమ్మగడ్డ నరసింహ, ఎం. నాగేంద్రరావు, ఒగ్గు ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.



పెద్ద చెరువుకు పడిన గండ్లను పరిశీలిస్తున్న నాయకులు

నాణ్యమైన సిమెంట్‌తోనే భవనాలు నిర్మించాలి

భారతి సిమెంట్ అసిస్టెంట్ మేనేజర్ కల్యాణ చక్రవర్తి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): భవన నిర్మాణాలకు సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన నాణ్యమైన సిమెంట్‌ను ఎంపిక చేసుకోవాలని భారతి సిమెంట్ అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) కల్యాణ చక్రవర్తి అన్నారు. కొండపల్లిలో శ్రీనివాస సిమెంట్, స్టీల్ డీలర్ కిశోర్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కంపెనీ సీనియర్ టెక్నికల్ అధికారి ఎస్.భవానీశంకర్‌తో కలిసి తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ అధునాతన పరిజ్ఞానం, నాణ్యమైన ముడి పదార్థాలతో తయారవుతుందని చెప్పారు. శ్లాబు వేసిన వారం రోజుల అనంతరం కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యత పరీక్షలు జరిపి భవన నిర్మాణ మేస్త్రీలు, భవన యజమానులకు వివరిస్తారన్నారు. మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. పలువురు మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులకు రూ.లక్ష చొప్పున బీమా సదుపాయం కల్పించిన బాండ్లు అందజేశారు.



తాపీమేస్త్రీలకు బీమా చెక్కులు అందజేస్తున్న భారతి సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

తిరువూరులో ఆటవికరాజ్యం నడుపుతున్న ఎమ్మెల్యే

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు, పక్కన కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో గత ఏడాది కాలంగా ఆటవిక రాజ్యం నడుస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ధ్వజమెత్తారు. తిరువూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 35 ఏళ్లుగా తాను రాజకీయాల్లో ఉన్నానని, ఏనాడూ ఇటువంటి దుర్భర పరిస్థితులు చూడలేదని చెప్పారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వీధిరౌడీలా, గూండాలా ప్రవర్తిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించడంలో పోలీసులు, అధికారులు విఫలమయ్యారని, ఎమ్మెల్యేకి వారు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

కౌన్సిలర్లపై దాడి జరుగుతున్నా పోలీసుల ప్రేక్షక పాత్ర

నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికలో పాల్గొనాల్సిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లపై టీడీపీ గూండాలు ఎమ్మెల్యే నాయకత్వంలో దాడికి పాల్పడితే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారన్నారు. కౌన్సిలర్లను తాము నగర పంచాయతీ కార్యాలయానికి తీసుకువస్తుంటే అడ్డుకుని టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగి మహిళా కౌన్సిలర్లను బెదిరించి తీసుకెళ్లారని చెప్పారు. తమ కౌన్సిలర్లను అక్రమంగా తీసుకెళ్లిన టీడీపీ నాయకులపై ఎటువంటి చర్యలూ తీసుకోలేని పోలీసులు.. నలుగురు కౌన్సిలర్లను తాము కిడ్నాప్ చేశామని తప్పుడు ఫిర్యాదులు సృష్టించి తనపై, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌పైనా తిరువూరు పోలీసు స్టేషన్లో కేసులు నమోదు చేశారన్నారు.

శాంతిభద్రతలు కరువు..

ఎమ్మెల్యే కొలికపూడి గెలిచిన నాటి నుంచి తిరువూరులో శాంతిభద్రతలు కరువయ్యాయని, ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తారో తెలియని ఆందోళనకర పరిస్థితి నెలకొందని స్వామిదాసు అన్నారు. తిరువూరు నియోజకవర్గం ఏర్పడిన నాటినుంచి ఎందరో మహానుభావులు చట్టసభల్లో తమ గళం వినిపించి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డారని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. కొలికపూడి మాత్రం అక్రమాలు, దౌర్జన్యాలు, దురాగతాలకు పాల్పడేందుకే గుంటూరు జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారని విమర్శించారు. ప్రశాంతంగా ఉండే తిరువూరులో కులాల మధ్య, ప్రజల మధ్య చిచ్చురేపి తమ పబ్బం గడుపుకుంటున్న ఎమ్మెల్యేకి, టీడీపీ నాయకులకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం..

తన ఇంటిపై టీడీపీ గూండాలు ఎమ్మెల్యే నాయకత్వంలో దాడి చేసిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయిస్తామని స్వామిదాసు అన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు, పరసా సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశి రామారావు, నాయకులు కె. చెన్నారావు, గోపాలరావు, గుమ్మా పాపారావు, రామవరపు దినేష్ పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

మునుకుళ్ల (తిరువూరురూరల్): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావలసిన పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచామని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. బుధవారం మండలంలోని మునుకుళ్ల రైతుసేవా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జనుము 10 కిలోల సంచులు, పిల్లిపెసర 8 కిలోల సంచులు, మిక్స్‌డ్ సీడ్ కిట్లు 10 కిలోల సంచులు రైతులకు సరఫరా చేస్తామన్నారు. ప్రధాన పంట వేయడానికి ముందు పచ్చిరొట్ట పంటలను భూమిలో వేసి 50 శాతం పూత దశలో భూమిలో కలియదున్నితే పోషకాలు అంది భూసారం పెరుగుతుందన్నారు. ఎకరాకు ఒక బ్యాగ్ చొప్పున గరిష్ఠంగా ఒక రైతుకు 5 బ్యాగుల వరకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తామని చెప్పారు. రైతుసేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలను పొందవచ్చన్నారు.



మునుకుళ్లలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి పద్మ

యోగాసనాలతో బహుళ ప్రయోజనాలు

తిరువూరు ఆర్డీఓ మాధురి

తిరువూరు: నిత్యం యోగాసనాలు, ప్రాణాయామం చేస్తే మానసిక, శారీరక వికాసం సాధ్యమవుతుందని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారిణి కె. మాధురి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద అంతర్జాతీయ యోగా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యోగాసనాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంప్రదాయమైన యోగాసనాలపై ఆసక్తి పెరుగుతోందన్నారు. ప్రాచీన కాలం నుంచి యోగా ప్రాచుర్యంలో ఉందన్నారు. యోగా వల్ల ఉపయోగాలను వివరించారు. తిరువూరు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు లక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, యోగా శిక్షకులు దారా నవీన్, దారా రాము, దేవిశెట్టి రాధాకృష్ణ పాల్గొన్నారు.

అధికారుల యోగాసనాలు

విస్సన్నపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విస్సన్నపేట పట్టణంలో అధికారులు బుధవారం యోగాసనాలు వేశారు. తహసీల్దారు లక్ష్మీకల్యాణి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆవరణలో జరిగిన యోగా కార్యక్రమంలో ఎంపీడీఓ చిన రాట్నాలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజాత, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు యోగాసనాలు వేయాలని తహసీల్దార్ కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆగిరిపల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని ఎంపీడీఓ ఆనంద్‌బాబు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి జూన్ 21తేదీ వరకు యోగా దినోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీడీఓ ఆనంద్ బాబు ఆధ్వర్యంలో కార్యాలయ, సచివాలయ సిబ్బంది యోగా శిక్షకుల ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఏఓ అబ్దుల్ సలాం, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

● మునునూరు: క్రమం తప్పని యోగా, ధ్యానంతో మంచి ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీఓ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో యోగాసనాలు వేయించి, యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యాలయ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న ఆర్డీఓ, సిబ్బంది



ఆగిరిపల్లిలో యోగాసనాలు వేస్తున్న ఎంపీడీఓ ఆనందబాబు

24న రామాలయ భూముల కౌలు వేలం

చాట్రాయి: చనుబండ కోదండ రామాలయానికి చెందిన భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 24న వేలం నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరసింహారావుపాలెం గ్రామంలో ఆర్ఎస్ నంబర్‌లోని 1573, 1575-2లో 4.50 ఎకరాలు, ఆర్ఎస్ నంబర్ 1219-2లో 1.10 ఎకరాలు, కృష్ణారావుపాలెంలో ఆర్ఎస్ నంబర్ 6.69 ఎకరాల భూములను ఏడాది పాటు కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 24న స్థానిక రామాలయంలో వేలం నిర్వహిస్తామని చెప్పారు. వేలంలో పాల్గొనదలచిన వారు ప్రతి భూమికి రూ 4 వేలు ధరావత్తు చెల్లించాలని, అదే రోజున 3వ వంతు చెల్లించాలని చెప్పారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

విస్సన్నపేట: విస్సన్నపేట మండలంలో విద్యుత్ సరఫరా మెరుగుదలకు చర్యలు చేపట్టామని విద్యుత్ ఏఈ విజయభాస్కర్ తెలిపారు. విస్సన్నపేట సబ్‌స్టేషన్‌లో అదనపు ఫీడర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ అందించనున్నామని చెప్పారు. విస్సన్నపేట టౌన్-1, నరసాపురం వ్యవసాయ ఫీడర్ల మరమ్మతులు జరుగుతుండటంతో ఆన్ ఆఫ్ ఫీడర్‌ను నూతనంగా ఏర్పాటు చేశామని వివరించారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

తిరువూరు: హనుమజ్జయంతి సందర్భంగా తిరువూరులోని పలు దేవాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయాల నిర్వాహకులు తెలిపారు. కోదండ రామాలయం, పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయం, స్వామి అయ్యప్ప సహిత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం, చీరాల సెంటర్ వీరాంజనేయస్వామి ఆలయం, రాజుపేట భక్తాంజనేయ ఆలయాల్లో స్వామివార్లకి పంచామృతాలతో, పాలతో అభిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

హనుమాన్ చాలీసా పారాయణం

మైలవరం: మైలవరం వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో హనుమాన్ చాలిసా పారాయణం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మైలవరం, రెడ్డిగూడెం, వీరులపాడు, జి.కొండూరు మండలాలకు చెందిన 16 భజన సమాజాలు పాల్గొన్నాయి. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు నూజివీడులో మినీ మహానాడు

నూజివీడు: ఏలూరు జిల్లా స్థాయి మినీ మహానాడు గురువారం నూజివీడులో నిర్వహిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నూజివీడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయి మినీ మహానాడు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు, జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, మండల, గ్రామ అధ్యక్షులు హాజరవుతారన్నారు.

సారా తయారీదారులకు రిమాండ్

చాట్రాయి: సారా తయారీదారులను రిమాండ్‌కు తరలించామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోతనపల్లి గ్రామానికి చెందిన ధారవతు శోభనాద్రి, చిన్నంపేట గ్రామానికి చెందిన గద్దల దేవమణి గతంలో సారా తయారీకి పాల్పడినందున అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించారని చెప్పారు.

పద్య కావ్యాలు పుస్తకాల ఆవిష్కరణ

నూజివీడు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను రాయడం అదృష్టమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, డీఏఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు అత్తిలి వెంకటరమణ అన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ కవి ఈమని శేషయ్య రచించిన సుప్రభాత సూర్యుడు బీఆర్ అంబేడ్కర్ పద్యకావ్యంను అత్తిలి వెంకటరమణ, ఈమని సప్తశతి పద్యకావ్యాన్ని రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు సూరి రామసూరి, చలసాని రామారావు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అరసం జిల్లా కార్యదర్శి శిఖా ఆకాష్ అధ్యక్షత వహించగా ఈ పుస్తకాల్లోని పద్యాలను ఏలూరు శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు హరికోటి, రంగస్థల నటులు గుజ్జుల చంద్రశేఖర్‌రావులు శ్రావ్యంగా ఆలపించారు. కావ్య విశ్లేషణను ఎస్ఆర్ఆర్ హైస్కూల్ తెలుగు పండితులు ఎంఎస్వీ ప్రసాద్ నిర్వహించారు. తెలుగు పండితులు పి. శివనాగరాజారావు, జడ సుబ్బారావు, ఈమని శేషయ్య పద్యరచనా శైలిని కొనియాడారు. కార్యక్రమంలో తంగిరాల సోని, కేవీ శివశాస్త్రి, పి. కృష్ణప్రసాద్, బత్తుల అనురాధ, కోటేశ్వరి పాల్గొన్నారు.

రేపు సీపీఐ నియోజకవర్గ మహాసభ

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ సీపీఐ ద్వితీయ మహాసభ ఈ నెల 23న జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ సమితి కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా తెలిపారు. స్థానిక బస్టాండు సెంటర్‌లోని సుంకర వీరభద్రరావు భవన్‌లో జరగనున్న మహాసభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు హాజరవుతారని చెప్పారు.